# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!

# హస్తం వస్తే చస్తం..

## ఆ చీకటి రోజులు మర్చిపోలేం



- కాంగ్రెస్ పాలనలో కరెంటు కటకటతో ఇబ్బందులు పడ్డాం
- మూడు గంటల కరెంటుతో పంటలు ఎండి అప్పుల పాలైనం
- పట్వారీ వ్యవస్థతో ఆగమైనం
- రైతులను ముంచిందే కాంగ్రెసోళ్లు..
- కొత్తపాట పాడితే నమ్మేది లేదు
- బీఆర్ఎస్ పాలనలోనే సవ్యంగా కరెంటు
- కేసీఆర్‌తోనే రాజులమయ్యామని రైతుల హర్షం

**పదేండ్ల క్రితం** కాంగ్రెస్ పాలనలో పడిన కష్టాలు చాలు. సరైన కరెంటు లేక వేసిన పంటలు వేసినట్లే మా కండ్ల ముందే ఎండిపోయాయి. సాగు కోసం చేసిన అప్పులు తీరక చనిపోయిన రైతులు ఇంకా గుర్తుకున్నరు. ఒకరి భూములు మరొకరి పేరుమీద రాసి రైతుల మధ్య చిచ్చురాజేసిన పటేల్, పట్వారీ వ్యవస్థతో ఎదుర్కొన్న ఇబ్బందులనూ మరువలేదు. ఇలా కాంగ్రెసోళ్ల పాలన అన్నింటా అన్నదాతలను ముంచిందే తప్ప.. మేలు చేసే ఒక్క పనైనా లేదు. తెలంగాణ రాకతో సీఎం కేసీఆర్ తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాలతో వ్యవసాయం పండుగైంది. ధరణితో రెవెన్యూ వ్యవస్థలో సమూల మార్పులు వచ్చి భూ వివాదాలు తగ్గాయి. 24గంటల ఉచిత కరెంటుతో బోర్లన్నీ ఫుల్లుగా పోస్తున్నాయి. రైతుబంధుతో పెట్టుబడి రంది లేకుండా పోయింది. ఇలా ప్రతీది రైతుకు మేలు చేకూర్చే పథకమే. కేసీఆర్ పాలనలో రైతులంతా రాజులయ్యారు. ఎన్నికల నేపథ్యంలో మళ్లీ వచ్చిన కాంగ్రెసోళ్లు.. రైతులను ఆగంజేసే పనులు చేస్తున్నరు. మూడు గంటల కరెంటు, 10హెచ్‌పీ మోటర్లు, ధరణిని తీసేస్తామని ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతూ రైతులను ముంచాలని చూస్తున్నరు. ఇంతటి కుట్ర చేస్తున్న కాంగ్రెసోళ్లను నమ్మితే మళ్లీ సచ్చే పరిస్థితే వస్తుందని రైతులు అభిప్రాయపడుతున్నారు. కాంగ్రెస్‌కు ఓటుతో బుద్ధి చెప్తామని స్పష్టం చేస్తున్నారు.



### 24 గంటల కరెంటిస్తుంటే కాంగ్రెస్‌కు కడుపు మంట

కేసీఆర్ ప్రభుత్వం రైతులకు ఫ్రీగా 24 గంటల కరెంట్ ఇస్తుంటే కాంగ్రెస్ పార్టీకి కడుపు మండుతున్నట్లుంది. మూడు గంటల కరెంట్ ఇస్తే పంటలెట్ల పండుతై. కష్టం కాదా? మీరు సరిగ్గా కరెంటు ఇయ్యకుండా.. మాకు పెద్దపెద్ద మోటర్లు పెట్టుకోమంటరా? 10 ఎస్పర్ మోటర్లు పెట్టుకోవాల్నంటే తక్కువ ఖర్చు అయితదా? వట్టిగనే బోర్ల దగ్గరికి ఉరికి అస్తయా? పైసలు ఎవరు ఇస్తరు..? ఉన్న బోర్లు, మోటర్లు ఏం జేయాలె. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉంటెనే రైతులకు మంచిగుంటది.

-గన్నా నాయక్, రైతు, కొయ్యగుట్ట తండా, బాన్సువాడ మండలం

### కాంగ్రెస్‌కే ఉల్టా షాకిస్తం..

బాన్సువాడ రూరల్: అప్పట్లో కాంగ్రెస్ ప్రభుత్వం సరిగా కరెంటు ఇయ్యకుంట మస్తు సతాయించింది. ఒక్కో పంట తియ్యాలంటే సచ్చి బతికినంత పనైతుండె. కరెంటు కోసం కావాలి కాసుకుంట.. నిద్ర ఉండకుండె. అద్దరాత్రి నిద్ర కాసుకొని పొలాల కాడ జాగారం చేస్తుండె. నిద్రమబ్బుల కరెంటు షాక్‌తోని మస్తుమంది సచ్చిపోయింద్రు. గిప్పుడు మళ్లా 3 గంటల కరెంటిచ్చి.. గాడికే తెస్తమంటే ఊరుకుంటమా? ఈ ఎలక్షన్ల ఉల్టా కాంగ్రెస్‌కే షాకిస్తం. కేసీఆర్ ప్రభుత్వం ఎంత మంచి కరెంటిస్తున్నది. రేవంత్‌రెడ్డికి పదవి లేక పిచ్చి పట్టింది.. ఎవలన్నా 24 గంటల కరెంటును వద్దంటరా?

-రవి, రైతు, కొయ్యగుట్ట, బాన్సువాడ మండలం







### కాంగ్రెస్ రైతు వ్యతిరేకి..

కాంగ్రెస్ ఎప్పటికీ రైతు వ్యతిరేక పార్టీనే. గతంలో అందరూ చూడలేదా? ఏనాడైనా రైతులకు మంచి పనులు చేసిందా? కాంగ్రెస్ హయాంలో ఉచిత కరెంట్ ప్రకటించి పూర్తిగా మోసం చేసింది. సరిగా కరెంటు ఇవ్వకుండా చాలా బాధపెట్టారు. కరెంటు రాంగనే పొలం దిక్కు ఉరుకుడు.. లేకుంటే ధర్నా చేసేందుకు రోడ్డెక్కుతుండె. అలాంటి పార్టీ, నాయకులను మళ్లీ గెలిపిస్తే గొయ్యి తవ్వుకున్నట్టే. కాంగ్రెస్‌కు ఈసారి కూడా గుణపాఠం తప్పదు. మా మోటర్లు, స్టార్టర్లు నెలకు రెండుమూడు సార్లు కాలిపోతుండె. చుక్కలు చూపించింద్రు. తెలంగాణ ప్రభుత్వం వచ్చాక రైతుల బాధలు తెలిసిన వ్యక్తిగా సీఎం కేసీఆర్ 24 గంటల ఉచిత కరెంటు ఇస్తున్నడు. ఆయనే రైతులకు దేవుడు.

-కాదిరెడ్డి రమేశ్, రైతు, బోర్లం, బాన్సువాడ మండలం

### కాంగ్రెస్‌ది ఎన్నడన్నా కరెంటిచ్చిన మొఖమా?

కాంగ్రెస్ వస్తే రైతులను సతాయించడే. ఆ నాయకులకు ఏనాడన్నా మంచి కరెంటిచిన్న మొఖమా? గీ బీఆర్ఎస్ ప్రభుత్వం అచ్చినంక పెసల్ తీసుకోకుండ ఫ్రీగానే 24 గంటలు కరెంటిస్తున్నది. బాధ లేకుంట పొలం పారిస్తున్నం. ఈ పదేండ్లళ్ల ఒక్క పంట గూడా ఎండిపోలేదు. ఇలాంటి సర్కారును ఎన్నడు సూడలేదు. చెరువులను బాగు చేసింద్రు. ఎల్లకాలం నీళ్లుంటున్నయ్. పొలాలన్నీ పచ్చగుంటున్నయ్. రైతుల చేతిల నాలుగు పైసలుంటున్నయ్. మళ్లా కేసీఆర్ సారే సీఎం గావాలె.

-సుధాకర్‌రెడ్డి, రైతు, హన్మాజీపేట్, బాన్సువాడ మండలం